

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**ముడ్ ముడ్ కే న దేఖ్, ముడ్ ముడ్ కే**
**జిందగానీ కే సఫర్ మే తూ అకేలా హీ నహీ హై**
**హంభి తేరే హం సఫర్ హై**
**ముడ్ ముడ్ కే న దేఖ్, ముడ్ ముడ్ కే...**

బహుశా వెనక్కు తిరిగి చూడగల జీవి, వెనక్కు చూసి గతాన్ని తలచుకుని ఆనంద విషాదాలు అనుభవించే జీవి మానవుడు ఒక్కటే. మిగతా జీవులకు సహజమైన ఇన్స్టింక్ట్( Instinct) ఉంటుంది. జ్ఞాపకం ఉంటుంది. కానీ జ్ఞాపకాలు ఉండవు. కుక్కలు, పిల్లులు వంటి జీవులను గమనిస్తే వాటికి గుర్తుంటుంది అనిపిస్తుంది. ఒకసారి ఆహారం లభించిన స్థలానికి అవి పదే పదే వెళ్తాయి. తమకు ఆహారాన్ని ఇచ్చిన వారిని గుర్తు పెట్టుకుంటాయి. కోపగించుకునే వారికి దూరంగా ఉంటాయి. పిల్లల కోసం గాలిస్తాయి. వాటికి ప్రమాదం ఏ వైపు నుంచి వస్తుందోనని అప్రమత్తంగా ఉంటాయి. వాటికి జ్ఞాపకం ఉంటుంది, కానీ జ్ఞాపకాలు ఉంటాయా? మనుషుల్లాగా 'గతం' వాటికి గుర్తుకు వస్తుందా? వెనక్కి తిరిగి చూసుకుని, తాము తీసుకున్న నిర్ణయాలలో మంచి చెడ్డలను విశ్లేషిస్తాయా? ఇలాగయితే బాగుండేది, ఆ పని చేసి ఉండాల్సింది కాదు, వారు కలవకపోయి ఉంటే నా జీవితం ఇలా ఉండేది కాదు అంటూ ఆలోచిస్తాయా? వాటి ప్రవర్తన చూస్తే వాటికి ప్రస్తుతం తప్ప గతం గురించి కానీ భవిష్యత్తు గురించి కానీ అంతగా ఆలోచనలున్నట్టు కనబడవు. కానీ అవి అలా పడుకుని శూన్యంలోకి చూస్తున్నప్పుడు ఏమాలోచిస్తున్నాయోననిపిస్తుంది. వెనక్కి తిరిగి చూడటం, గతం తలచి వగచటంలోని సౌఖ్యం అనుభవించటం మనిషికే ప్రత్యేకమేమో అనిపిస్తుంది.

కొత్త సంవత్సరం వస్తున్న సమయంలో, పాత జ్ఞాపకాలను తాజా చేసుకుంటూ రాబోయే సంవత్సరంలో సాధించబోయే అంశాల గురించి ఆలోచిస్తూ, ఎదుర్కోవాల్సిన సమస్యలను అంచనా వేస్తూ ముందుకు సాగటం సర్వసాధారణం. శ్రీ 420 సినిమాలో శైలేంద్ర రాసిన శంకర్ జై కిషన్ బాణీ కూర్చిన ఈ పాట వింటూంటే గతాన్ని తలవటం మనిషికి వరమా? శాపమా? అర్థంకాదు. గతం తలవని, గతం తలపుకురాని జీవులన్నీ హాయిగా, ఆనందంగా వర్తమానంలో జీవిస్తాయి. వాటికి గతం గురించిన బాధ ఉండదు. భవిష్యత్తు గురించిన బెంగ ఉండదు. ఆ క్షణంలోనే

బ్రతుకుతాయి. ఆనందమో, విషాదమో, భయమో, బాధనో ఆ క్షణంలోనే అనుభవిస్తాయి. కానీ మనిషిని గతానుభవాలు వెంటాడుతూంటాయి. భవిష్యత్తు గురించి బెంగ ఉంటుంది. ఎప్పుడు ఏమవుతుందో? భవిష్యత్తు ఎలా ఉంటుందోనని పలు ఆలోచనలు ముసురుకుంటాయి. భయపెడతాయి. వర్తమానాన్ని ప్రభావితం చేస్తాయి.

**ముఝె దర్ద్ – ఎ – దిల్ క పతా న థా**

**ముఝె ఆప్ కిస్ లియె మిల్ గయే**

**మై అకేలె యూన్ హి మజేమె థా**

**ముఝె ఆప్ కిస్ లియె మిల్‌గయే**

మహమ్మద్ రఫీ పాడిన ఈ పాట ఇలాంటిదే. ఆమె పరిచయమయ్యేంతవరకూ అతడికి హృదయవేదన అంటే పరిచయం లేదట. ఆమె కలవక ముందు ఒంటరిగా హాయిగా ఉండేవాడట. ఆమె కలసిన తరువాతనే అతనికి వేదన అంటే ఏమిటో తెలిసింది. 'నన్ను ఎందుకు కలిశావు?' అని అడుగుతున్నాడు.

**ఆయా హై ముఝే ఫిర్ యాద్ వో జాలిం**

**గుజరా జమానా బచ్‌పన్ కా**

**హాయ్ రే అకేలె ఛోడ్ కె జానా**

**ఔర్ న అనా బచ్‌పన్ కా**

**ఆయా హై ముఝే ఫిర్ యాద్ వో జాలిం**

ముకేష్ స్వరం గతం జ్ఞాపకాల తాలుకు విషాదాన్ని పదం పదంలో పలుకుతూంటే జ్ఞాపకాల వెల్లువలో కొట్టుకుపోతాం. ఇక్కడ ముకేష్ పాడుతున్నది బాల్యం జ్ఞాపకాల గురించి. ఎంతోమందికి బాల్యం చీకూ చింతాలేని, భవిష్యత్తు గురించి ఏ మాత్రం ఆలోచన లేని అత్యంత ఆనందకరమైన కాలం. అంటే గతంలేని, భవిష్యత్తు గురించి ఆలోచనలేని స్థితి అత్యంత ఆనందకరమైన స్థితి అన్నమాట. అంటే, మనిషికన్నా జంతువులు నిరంతరం అత్యంతానందకరమైన స్థితిలో ఉంటాయా? బాల్యంలో గతం ఉండదు. ఎందుకంటే వ్యక్తి 'సమయం' ఆరంభమయ్యేది అప్పుడే. భవిష్యత్తు గురించిన ఊహనే లేదు. అందుకే ప్రతీదీ ఆశ్చర్యకరము, ప్రతీదీ ఆనందమయమే బాల్యంలో.

**అల్‌బేలే దిన్ ప్యారే**

**మెరె బిఛ్డే సాథి సహారే**

**హాయే కహాన్ గయే..హాయే కహా గయే**

**ఆఖోంకే ఉజియారే**

**మెరె సూని రాత్‌కే తారే**

**హాయ్ కహాన్ గయే....**

ఎంతో ఆనందమయం అంటున్నాడు కిషోర్ కుమార్. అతని కళ్ళ వెలుతురట. చీకటి రాత్రిలో వెలుగుచూపే తార అట.. అతని బాల్యం అంత మధురం. ఎక్కడ పోయింది బా బాల్యం? అని ఆవేదనతో అంటున్నాడు. తన గతించిన రోజులని ఎవరయినా తిరిగి ఇవ్వండని, తిరిగి వచ్చేట్టు చేయమని అభ్యర్థిస్తున్నాడు.

**కోయి లౌటాదె మెరే బీతెహువె దిన్**

**బీతెహువె దిన్   వొ మెరే ప్యార్ పల్ఛిన్**

అంటాడు కిషోర్ కుమార్. గడచిపోయిన దినాలను తిరిగి తెచ్చిమ్మంటున్నాడు. కానీ 'గతం' అనుభవాలు పాఠాలు నేర్చుకోవటానికే తప్ప గతం గురించి ఆలోచిస్తూ, వాటిలోనే మునిగిపోయి వర్తమానాన్ని విస్మరించి భవిష్యత్తును పాడుచేసుకునేందుకు కాదు.

అందరి బాల్యం ఆనందమయంకాదు. పలు కారణాల వల్ల బాల్యం విషాదమయమే కాదు దుర్భరం కూడా. తల్లిదండ్రుల నడుమ సఖ్యత లేకపోవటం వల్లనో, పేదరికం వల్లనో, తల్లితండ్రి మరణించటం వల్లనో, ఇలా ఎన్నెన్నో కారణాలు బాల్యం దుర్భర వేదనమయం కావటానికి. 'నిద్రలో శిశువు ఏయే సుందర స్వప్నాలు దర్శిస్తున్నాడో ' అనుకునే వీలులేదు ఇలాంటి పరిస్థితులలో.

**తుమ్హారే హై తుం సే దయా మాంగ్తే హై**

**తెరే లాడ్యోంకీ దువా మాంగ్తే హై**

గుండె బాధతో బరువెక్కి, కంటనీరు పొంగించే శక్తివంతమైన భావన. బూట్ పాలిష్ సినిమాలో శైలేంద్ర రాసిన పాట ఇది. సాధారణంగా పిల్లలను తల్లిదండ్రులు అపురూపంగా చూసుకుంటారు తమ జీవిత సర్వస్వం వారి కోసం ధార పోస్తారు. అనుక్షణం వారి క్షేమం కోసం తపిస్తారు. తల్లిదండ్రుల హృదయపు తునకలు పిల్లలు. ప్రాణం పిల్లలు. కానీ పలు సందర్భాలలో పిల్లల పైనుండి తల్లిదండ్రుల నీడ తొలిగిపోతుంది. పిల్లలు అనాధలవుతారు. ప్రపంచపు ఆటుపోట్లను బాల్యంలోనే, ఇంకా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధం కాని వయసులోనే ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటి వారిని అనాధ శరణాలయాలు ఆదుకుంటాయి. బూట్ పాలిష్ సినిమాలో అలాంటి సందర్భంలో, అనాధ శరణాలయానికి నిధుల కోసం, శరణాలయంలో పిల్లలకు బట్టలు, ఇతర అవసరమైన విషయాలకోసం అభ్యర్థిస్తూ పాడే పాట ఇది. సందర్భం అత్యంత దయనీయం.  స్థితి శోచనీయం. 'వేడుట సావు, వేడగా బడుట ఇంకా సావు' అంటాడు తిక్కన్న. అలాంటి సందర్భం ఇది. ఈ సందర్భంలో శైలేంద్ర పాటలో పొదిగిన భావాలు గుండెను చీల్చేస్తాయి. ఏదో సంపాదించుకుని తింటూ ఆనందంగా జీవించేస్తున్నామన్న మిధ్యా సంతృప్తి పటాపంచలు చేస్తాయి. పిల్లలు పాడుతున్నారు.

'మేమూ మీ వాళ్ళమే. మీ దయను అభ్యర్ధిస్తున్నాము. మీ ప్రియమైన పిల్లల ఆశీస్సులు కోరుతున్నాము' గుండెలు పిండేసే భావన. తల్లి తన పిల్లవాడిని గుండెకు హత్తుకుంటుంది. కాలు క్రింద పెడితే కందిపోతుందన్నట్టు బాధపడుతుంది. అదే సంవేదనము, అదే ప్రేమను పరాయి పిల్లలయిన తమ మీదకూడా ప్రసరింప చేయమని అభ్యర్ధిస్తున్నారు అనాధలు. 'మేము మీ వాళ్ళమే', అంటే మేమూ మనుషులమే. మా తల్లిదండ్రులు కూడా మమ్మల్ని ఎంతో ప్రేమగా కన్నారు. కానీ పరిస్థితులు మమ్మల్ని అనాధలను చేశాయి. కాబట్టి మీ పిల్లల మీద ప్రేమను, వారికిచ్చే దీవెనలను కొన్ని ఈ వైపుకు కూడా ప్రసరింపచేయమంటున్నారు. సాటి మనిషిని మనిషిగా చూడలేదు మనిషి. ఎదుటి మనిషి తనలాంటి వాడేనని తెలుస్తూన్నా, వాడిని తనలానే చూడటానికి అహంకారం అడ్డువస్తుంది. స్థాయి అడ్డువస్తుంది. సామాజిక నియమ నిబంధనలు అడ్డువస్తాయి.

'సుజాత' సినిమాలో ఓ సంఘటన ఉంటుంది. అంటరాని వాళ్ల అనాధ పాపకు ఇంట్లో ఆశ్రయమిస్తాడు భర్త. భార్యకు అది ఇష్టంలేదు. పిల్లను ఇంట్లోకి రానీయదు. ఇక్కడ ప్రేమగా తన పిల్లను నిద్రపుచ్చుతూంటుంది. పక్క గదిలో అనాధ పాప ఏడుస్తుంది. ఆమె హృదయం కరుగుతుంది. తన పాపకు జోలపాట ఆ వైపు చూస్తూ పాడుతుంది. అద్భుతమైన సన్నివేశం అది. ఎన్ని నియమాలు, నిబంధనలూ స్థాయీ భేదాలు ఉన్న మౌలికంగా మనిషిలో మానవత్వం ఉంటుందని నిరూపించే సన్నివేశం అది. ఇక్కడ శైలేంద్ర తన పాటలో ఆ స్వభావాన్ని ఉద్దీపించాలని ప్రయత్నిస్తున్నాడు. మీ వాళ్లమూ, మీ నుంచి దయను అభ్యర్ధిస్తున్నాము అంటున్నాడు.

**యతీమోంకి దునియామె హర్‌దం అంధేరా**
**ఇధర్ భూల్కర్భీ న ఆయా సవేరా**
**ఇసీ షాంకో ఏక్ పల్ భర్ జలా జో**
**హం ఆశాకి ఐసా దియా మాంగ్తే హై..**

అనాధల ప్రపంచంలో నిరంతరం చీకటే. ఆ వైపు పొరపాటున కూడా వెలుతురు రాదు. నిరంతరం చీకటి అయిన ఈ ప్రపంచంలో క్షణ కాలమయినా వెలుతురు నిచ్చే దీపంలాంటి ఆశను వెలిగించే దయను అభ్యర్ధిస్తున్నాము అంటున్నారు పిల్లలు.

**థె హం జింకి ఆంఖోంకె చంచల్ సితారే**
**హమే ఛోడ్కే వో ఇస్ జహాన్ సే సిధారే**
**కిసీ కి నహో జైసి కిస్మత్ హై అప్ని**
**దుఖీ దిల్ సభీకే భలా మాంగ్తే హై**

ఎవరి కళ్లల్లో వెలుగులాంటి వారమో, వారు మమ్మల్ని ఒంటరిగా వదలి ఈ ప్రపంచంలోంచి వెళ్లిపోయారు. మాలాంటి దురదృష్టం ఇంకెవరికీ కలగకూడదని, బాధపడుతూన్న హృదయం అందరి మంచిని కోరుతోంది అంటున్నాడు మహమ్మద్ రఫీ హృదయ విదారకంగా.

**బచాహో జొ రోటీ కా టుక్డా దిలాదో**

**జో ఉత్‌రా  హొ తన్ సే వొ కప్డా దిలాదో**

ఈ చరణం రఫీ పాడిన విధానం, అతని గొంతులోని ఆవేదన,  సినిమాలో సందర్భం కంట నీరు పొంగిస్తుంది. సినిమాలో పిల్లలకు ఎవరిముందు చేయసాచ వద్దని బోధిస్తారు.

**'భీక్  మే జో మోతీమిలే తోభీ హం న లేంగే**

**జిందగీ కె ఆసూవోంకి మాలా పహనేంగే'**

'భిక్షంగా/ఉచితంగా/తేరగా  ముత్యాలు లభించినా స్వీకరించం. జీవితపు కన్నీళ్ల మాలను ధరిస్తాం తప్ప ఉచితంగా వచ్చేదాన్ని దేన్నీ స్వీకరించం' అంటారు పిల్లలు. 'నన్నే మున్నే బచ్చి తేదీ ముఠీ మె క్యా హై' అన్న పాటలో. అలాంటి పిల్లవాడు,  ఇప్పుడు మీరు తినగా మిగిలిన రొట్టె ముక్కలను మాకు ఇవ్వండి, మీ శరీరం మీదనుంచి విడిచి వేసిన బట్టలు ఇవ్వండి అని అభ్యర్థిస్తూంటే భరించలేకపోతాడు. ఆ అనాధల గుంపునుంచి వేరు వెళ్తాడు. సరిగ్గా అప్పుడే అతను ఎవరికోసం వెతుకుతున్నాడో, ఆమె ధనవంతుల ఇంట ఉంటుంది. ఆమె అనాధలకు తనవంతు దానం అందిస్తుంది. అలా సినిమాలో ఉద్విగ్నతను, మనసు కరిగించే వేదనను ఒకేసారి కలిగిస్తాడు దర్శకుడు.

కాబట్టి, అందరూ గడచిన బాల్యాన్ని తలచుకుని అందమైన బాల్యం మళ్లీ తిరిగి రావాలని కోరుకోరు. బాల్యం తలచుకుని కుళ్లుతారు. బాధపడతారు. కొందరి జ్ఞాపకాలు ఇలాంటివయితే మరికొందరి జ్ఞాపకాలు దూరమైన ప్రేయసి గురించినవి.

**వొ జబ్ యాద్ ఆయే, బహుత్ యాద్ ఆయే**

**గం – ఎ – జిందగీ కె అంధేరే మె హం నే**

**చరాగ్– ఎ –మొహబ్బత్ జలాయే, బుఝాయే**

ఆమె ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా, పట్టలేనంతగా జ్ఞాపకం వస్తుందట.  వేదన అంధకారంలో ప్రేమ దీపం వెలిగించి, ఆర్పినప్పుడల్లా ఆమె గుర్తుకు వస్తుందట. అంటే ప్రేమభావన తలపుకు రాగానే ఆమె గుర్తుకు వస్తుంది. ఆమె దగ్గర లేదనగానే చీకటయిపోతుంది. ఆమె జ్ఞాపకం మిగులుతుంది.  అయితే 'మరుపురాని బాధకన్నా మధురమే లేదు' అన్నట్టు ఎవరినయితే మరచిపోవాలని ప్రయత్నిస్తామో, వారిని మరవటం కుదరదు. ఎంతగా మరచి పోవాలనుకున్నా మరపుకు రారు.

**జిన్‌హే హం భూల్  నా చాహే, వొ అక్సర్ యాద్ తేహై**

**బరాహో జిస్ మొహబ్బత్ కా, వొ క్యూన్ కర్ యాద్ ఆతే  హై**

ఎవరినయితే మరచి పోవాలని ప్రయత్నిస్తామో, వారు అధికంగా, ఎల్లప్పుడూ గుర్తుకొస్తారు. ఏ ప్రేమనయితే మరచి పోవాలనుకుంటామో, ఆ ప్రేమ అధికంగా గుర్తుకొస్తుంది. మరో ప్రేమికుడూ ఇదే మరో రకంగా అన్నాడు.

**తెరీయాద్ దిల్సే భులానే చలా హూ**

**మై ఖుద్ అప్ని హస్తీ మిటానే చలా హూ...**

ఆమె జ్ఞాపకాలను హృదయంలోంచి తొలగించాలని నిశ్చయించుకున్నాడట. అందుకోసం తన జీవితాన్నే నాశనం చేయాలని నిశ్చయించుకున్నాడు 'హస్తీ' అంటే యవ్వనం. 'హస్తీ' అంటే శరీరం. 'హస్తీ' అంటే గుర్తింపు. కాబట్టి 'మై ఖుద్ అప్ని హస్తీ మిటానే చలా హూ' అంటే తన ఐడెంటిటీని, తానే నాశనం చేసుకోవాలని నిశ్చయించుకున్నట్టు భావించాల్సి ఉంటుంది. మరచిపోవటం అంత కష్టం. అందుకే జ్ఞాపకాలు మనిషికి ఓ వైపు వరం అయితే మరోవైపు శాపం.

**దునియామె యూన్ అనా**

**దునియా సే యూన్ జానా**

**ఆవో తొ లే అనా, జావో తో దే జానా**

**యాదే యాదే యాదే**

**బాల్  భూల్  జాతే హై**

**యాదే యాద్ ఆతీ హై**

ప్రపంచంలో వస్తాం. వెళ్తాం. వచ్చేటప్పుడు పూర్వ జన్మస్మృతులు వెంటపెట్టుకొస్తాం. వెళ్లేటప్పుడు జ్ఞాపకాలు ఇచ్చి వెళ్తాం. ప్రపంచమంతా జ్ఞాపకాలే. జ్ఞాపకాలు, జ్ఞాపకాలే. అలాంటి 'జ్ఞాపకాల ప్రపంచంలో గతాన్ని తలచుకోకు, వెనుతిరిగి చూడకు, ముందుకు సాగిపో' అని చెప్పటం సులభం. ఆచరించటం కష్టం.

గమనిస్తే, మనిషి శ్రేష్టమైనవిగా భావించేవన్నీ జంతు లక్షణాలే. వృషభమూ, సింహం, పులి, లేడి ఇవన్నీ ఉత్తమ లక్షణాలకు ప్రతీకలు. తాబేలులాగా అంగాలు ముడుచుకోవటం వైరాగ్యానికిఉత్తమ నిదర్శనం. చిలుకపలుకులు, కోకిల పాటలు, నెమలి నృత్యం, హంస నడక, డేగచూపు, చకోర పక్షి ఎదురు చూపులు, ఇవన్నీ ఏదో ఓ రూపంలో ఉత్తమత్వానికి, పర్‌ఫెక్షన్‌కి ప్రతీకలు. అలాగే జంతువుల్లా, కీటకాల్లా 'గతం' మరచి, ముందుకు సాగిపోవటం కూడా ఉత్తమత్వానికీ, ఆనంద జీవనానికీ నిదర్శనం.

కాలం ఎప్పుడూ ముందుకే సాగుతుంది. వెనుకడుగు వేయటం అన్నది కాలం ఎరుగదు. కాలం 'వెనుకకు ప్రయాణిస్తే?' అన్న ఆలోచన తత్త్వవేత్తలను బాధించింది. విజ్ఞాన శాస్త్రజ్ఞులను వేధిస్తోంది. సైన్స్ ఫిక్షన్ రచయితలకు

బోలెడన్ని ఊహలనిస్తోంది. అసలు మనిషి జీవితం బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం కాకుండా అనుభవంతో నిండిన వృద్ధాప్యం, దాంతో కాలం విలువ గ్రహించిన యవ్వనం, ఆపై నిస్సహాయమైన బాల్యం అయితే ప్రపంచం ఎంతో గొప్పగా, ఆనందకరమూ, శాంతి పూర్ణమూ అవుతుందని పలువురు తత్త్వ వేత్తలు భావిస్తారు. కానీ కాలం ఎక్కుపెట్టి విడిచిన బాణంలా ముందుకే సాగుతుంది తప్ప వెనక్కు మళ్లిరాదు. అందుకే ఆడినమాట, విడిచిన బాణం, వేసిన అడుగు వెనక్కు తీసుకోవటం కుదరదంటారు. అలాంటప్పుడు మనస్సు మాత్రం వెనక్కి ఎందుకు ప్రయాణించాలి? వెనక్కి తిరిగి ఎందుకు చూడాలి? కాబట్టి వెనక్కి తిరిగి చూడక ముందుకు సాగటమే ఉత్తమం.

**నైనోం సె జో నైనా మిలాకే దేఖే**
**మౌసం కే సాథ్ జో మూస్కురాకే దేఖే**
**దునియా ఉసీ కీ జో ఆగే దేఖే...**

అద్భుతమైన వాక్యాలు. సినిమా పాటనా? వ్యక్తిత్వ వికాస పాఠమా? అనిపించే భావం. వెనక్కి చూడటం వల్ల వచ్చేదేమీ లేదు. ముందుకు చూడాలి. ముందుకు చూడగలిగిన వాడు అడ్డంకులను ముందే గమనించి పక్కకు తప్పుకు పోతాడు. అందుకే కాలం అడుగులో అడుగు కదుపుతూ, నవ్వుతూ ముందుకు సాగే వాడిదే ప్రపంచం అంటున్నాడు శైలేంద్ర. ఇక్కడ 'మౌసం కే సాథ్ ముస్కురానా' చాలా గొప్ప భావన. మనిషి సాధారణంగా తాను ఎంతో కష్టపడుతున్నాడని నమ్ముతాడు. ఇతరులను నమ్మించాలని ప్రయత్నిస్తాడు. ప్రతీదీ తనకు కష్టం. అదే ఇతరులకు తేలిక. వారి కష్టం కష్టంకాదు. అయినా సరే కష్టం అన్నది లెక్క చేయకుండా, ప్రతిదాన్నీ ఒక అనుభవంలా ఆనందంగా అనుభవిస్తూ, నవ్వుతూండగలగటం ఒక వరం. ఎండకు ఎండాలి, వానకు తడవాలి, చలికి వణకాలి. ఏది లభిస్తే దాన్ని సంతోషంగా స్వీకరించాలి. ముందుకు సాగాలి. ఇక, 'ముందుకు చూడటం ' గురించి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ప్రపంచంలో వస్తున్న మార్పులను గమనించి ఇతరులు గ్రహించేలోగా, ఆ మార్పును స్వీకరించిన వాడు, అందరికన్నా ముందుంటాడు. మన వ్యక్తిత్వ వికాస నిపుణులు చెప్పేది అదే. సెల్ ఫోన్లు వస్తున్నప్పుడే ల్యాండ్ లైన్లను వదల్చుకున్న వాడు ఓ అడుగు ముందుంటాడు. సెల్ ఫోన్లు ఇంకా మాట్లాడటానికే పరిమితమైనప్పుడు, సెల్ ఫోన్‌లో భవిష్యత్తు కంప్యూటర్లను దర్శించినవాడు అందరికన్నా ఓ అడుగు ముందుంటాడు. లాంగ్ ప్లే రికార్డులను వదల్చుకుని క్యాసెట్లను కొన్నవాడు, క్యాసెట్లు అందరూ కొంటున్నపుడు 'సీడీ 'ని చూసినవాడు, సీడీ క్రేజ్ ఉన్నప్పుడు పెన్ డ్రైవ్ వైపు దూకినవాడు.. ఇలా చెప్తూ పోతే 'ముందుకు చూడటం' అభివృద్ధికి రాజమార్గం అని అర్థమవుతుంది. ఎడ్ల బండిలో ప్రయాణిస్తూ చంద్రమండల యాత్ర గురించి ఆలోచించేవాడు పిచ్చివాడు కాదు. ద్రష్ట.

**దునియాకే సాథ్ జో బదల్తా జాయే**
**జో ఇస్కే సాంచే మే హీ ఢల్తా జాయే**

**దునియా ఉసీకే హై జో చల్తా జాయే.**

వ్యక్తిత్వ వికాసానికి విశిష్టమైన సూచనలివి. మారే ప్రపంచంతో పాటు మారగలిగే వాడిదే ప్రపంచం. ఇక్కడ 'సాంచే మే ఢల్నా' అన్న పద ప్రయోగం చేశాడు శైలేంద్ర. 'సాంచే' అంటే మౌల్డ్(mould). అంటే అచ్చు, పోత. సమయం తయారు చేస్తున్న అచ్చులో ఒదిగిపోవటం. అద్భుతమైన భావన. సమయం అడుగులో అడుగు కలిపి నడవటం మాత్రమే కాదు, సమయం ఎలాంటిదో అలా ఒదిగిపోవటం అన్నమాట. రోములో రోమన్‌లా ఉండమనటం, నీటిలో చేపలాగా, గాలిలో పక్షిలాగా ఉండటంలాంటిది. అలా మారి, ఒదిగి పోయేవాడికి ఢోకా లేదు. 'దునియా ఉసీ కే హై జో చల్తా జాయే' అలా ముందుకు సాగగలిగే వాడిదే ప్రపంచం. వెనక్కి తిరిగి చూస్తే ఏమీ ఉండదు. 'గతం గతః' సినిమాలో అతి చక్కని సందర్భం ఇది. నాయకుడు పేదవాడు. నీతిమంతుడు. అతని ప్రేయసి విద్య. నిజాయితీకి మారు పేరు. పేదరికం నుంచి అతనికి ధనం వైపు దారి చూపుతుంది మాయ. క్లబ్బులో, పేకటలో మోసాలు, కంపెనీలు పెట్టి సామాన్యులను మోసం చేసే మాయా ప్రపంచం అది. నకిలీ ప్రపంచం. విద్య ది స్వచ్ఛమైన ప్రపంచం. మాయ ప్రపంచం నచ్చక విద్య వదలి వెళ్తుంది. మాయ రమ్మంటుంది. నాయకుడు వెనక్కి తిరిగి వెళ్ళాలో, ముందు మాయవైపుకు వెళ్ళాలో నిశ్చయించుకోలేకపోతాడు. అప్పుడు వస్తుందీ పాట. వెనక్కు తిరిగిచూడకు. ముందుకు అడుగు వేయి అని...సందర్భంలో ఒదిగింది. గొప్ప సత్యం చెప్తోంది. దాంతో సినిమాపాట సార్వజనీన భావాలు ప్రదర్శించి మార్గదర్శకత్వం చేయగల వ్యక్తిత్వ వికాస గీతంలా ఎదిగింది.

**బీతె దినోంకి యాద్ థి జిన్మే**
**మైవో తరానే భూల్ చుకా**
**ఆజ్ నయే మంజిల్ హై మేరీ**
**కల్‌కె ఠికానే భూల్ చుకా**

మహమ్మద్ రఫీ 'ఆద్మీ' సినిమాలో పాడిన అద్భుతమైన పాట చరణంలోని పంక్తులు ఇవి. గడచిన రోజుల జ్ఞాపకాలు మరచాను. అగాధలు మరచాను. ఇప్పుడు నా గమ్యం వేరు. గతం నాటివన్నీ మరచిపోయాను. అంటే పాము కుబుసం విడిచినట్టు గతాన్ని విడిచి కొత్త రూపం ధరించాడన్నమాట. తెలుగులో 'గుడి గంటలు' సినిమాలోని 'జన్మమెత్తితిరా 'కు హిందీ రూపం ఈ పాట.

కాబట్టి గతంలో ఏం జరిగిందీ, ఎవరెవరూ మనల్ని వదలి వెళ్లారు, ఎంత బాధ కలిగించారు, ఎంత వేదనను కలిగించారు, ఎన్ని కష్టాలు అనుభవించాం, ఎంత బాధపడ్డాం అని గతాన్ని స్మరిస్తూంటే వర్తమానం చేజారిపోతుంది. భవిష్యత్తు చెదిరిపోతుంది. కాబట్టి వెనక్కి తిరిగి చూడటం మాని ముందుకు సాగిపోవాలి. కరోనాను, లాక్‌డౌన్‌లను వదలి ఒమైక్రాన్‌ను విస్మరించి, కొత్త సంవత్సరం, కొత్తరోజు, కొత్త ప్రపంచం అనుకుని ముందుకు సాగుతూ, కొత్త

జ్ఞాపకాలు సృష్టించుకోవాలి, కొత్త జీవితం ఆరంభించాలి. పాత ప్రపంచాన్ని కొత్తగా చూడగలగాలి. కొత్త ప్రపంచంవైపు సాగిపోవాలి. అందుకే 'ముడ్ ముడ్ కే న దేఖ్ ', 'దునియా ఉసీ కే జో ఆగే దేఖే', 'దునియా ఉసీకే జో చల్తా జాయే' అనుకుంటూ 2021 ను వెనక వదలి కాలంతో కదులుతూ కాలంతో మారుతూ 2022కు స్వాగతం పలుకుదాం. ముందుకు సాగుదాం.

అందరికీ నూతన సంవత్సర ఆర్ధిక, హార్ధిక శుభాకాంక్షలు

"వచ్చే నెల మరిన్ని మధురమైన పాటలతో"

Post your comments